సాక్షి అనకాపల్లి

బుధవారం ı 27 ı డిసెంబర్ ı 2023



కనకమహాలక్ష్మికి భక్తుల పూజలు

విశాఖ: మార్గశిర మాసోత్సవాల్లో మంగళవారం అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.



చరిత్రాత్మకం

8లో

అసైన్డ్ భూములకు హక్కు పత్రాలు పంపిణీ చేయడం చరిత్రాత్మకమని డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు అన్నారు.

వాతావరణం

అనకాపల్లి: రాగల ఐదు రోజులు ఆకాశం మేఘావృతమై ఉంటుందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వాతావరణ శాస్త్రవేత్త ఎంజీజీఎస్ కుమారి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గరిష్ట ఉష్ణోగ్రతలు 29.1 నుంచి 29.5, కనిష్ట ఉష్ణోగ్రతలు 22.5 నుంచి 22.6 డిగ్రీల మధ్య నమోదవుతాయన్నారు.

న్యూస్‌రీల్

డీఎఫ్‌వోగా జగన్నాథ్‌సింగ్



నర్సీపట్నం: జిల్లా అటవీ శాఖ అధికారిగా ఆర్.జగన్నాథ్‌సింగ్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మంగళవారం రాష్ట్రంలో ఐఎఫ్‌ఎస్ అధికారుల బదిలీలు జరిగాయి. 2013 ఐఎఫ్‌ఎస్ బ్యాచ్‌కు చెందిన జగన్నాథ్‌సింగ్ ప్రస్తుతం నెల్లూరు జిల్లా ఏపీఎఫ్‌డీసీ రీజనల్ మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. నర్సీపట్నం డీఎఫ్‌వోగా పనిచేసిన రాజారావు ఇటీవల ఏసీబీ అధికారులకు పట్టుబడిన విషయం తెలిసిందే. అనకాపల్లి సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌వో ప్రస్తుతం ఇన్‌చార్జి డీఎఫ్‌వోగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ స్థానంలో జగన్నాథ్‌సింగ్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రెండు రోజుల్లో ఆయన బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉందని కార్యాలయ అధికారులు తెలిపారు.

పలు రైళ్లకు అదనపు కోచ్‌లు

తాటిచెట్లపాలెం (విశాఖ ఉత్తర): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా పలు రైళ్లకు అదనపు కోచ్‌లను తాత్కాలిక ప్రాతిపదికన జత చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి ప్రకటనలో తెలిపారు.

1)విశాఖపట్నం-గుణుపూర్-విశాఖపట్నం (08522/08521) పాసింజర్ స్పెషల్‌కు జనవరి 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ఒక థర్డ్ ఏసీ, ఒక స్లీపర్ క్లాస్ కోచ్‌లను జత చేస్తున్నారు.

2) విశాఖపట్నం-బనారస్(18311) వీక్లీ స్పెషల్‌కు జనవరి 3వ తేదీ నుంచి 31వ తేదీ వరకు తిరుగు ప్రయాణంలో బయల్దేరే బనారస్ - విశాఖపట్నం (18312) వీక్లీ స్పెషల్‌కు జనవరి 4వ తేదీ నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు ఒక థర్డ్ ఏసీ ఎకానమి కోచ్‌ను ఆయా రోజుల్లో జత చేస్తున్నారు.

జీవీఎంసీ స్థాయీ సంఘ బడ్జెట్ సమావేశం రేపు

డాబాగార్డెన్స్ (విశాఖ): జీవీఎంసీ స్థాయీ సంఘం బడ్జెట్ సమావేశం ఈ నెల 28న నగర మేయర్, స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన నిర్వహించనున్నారు. ఆ రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశ మందిరంలో నిర్వహించనున్న సమావేశంలో 2023-24 ఏడాదికి సవరించిన బడ్జెట్ అంచనాలపై చర్చ, 2024-25 ఏడాదికి బడ్జెట్ అంచనాలు రూపొందించనున్నారు. సెక్షన్ 184 ప్రకారం స్థాయీ సంఘం ఆమోదం తెలిపిన అనంతరం సెక్షన్ 185 ప్రకారం వచ్చే నెల 10వ తేదీలోగా కార్పొరేషన్‌కు అందజేయాల్సి ఉంది.

అప్పన్నను దర్శించుకున్న ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న జస్టిస్ సుధీర్‌కుమార్ జైన్ దంపతులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని మంగళవారం ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుధీర్‌కుమార్ జైన్ దంపతులు దర్శించుకున్నారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద న్యాయమూర్తికి అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం న్యాయమూర్తి ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు.

రక్తహీనత లేకుండా చేయాలి

కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

తుమ్మపాల: బాలలు, గర్భిణులలో రక్తహీనతను పూర్తిగా తగ్గించాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఈ విషయమై ఆయన ఆరోగ్య, స్త్రీ శిశు సంక్షేమ, విద్యాశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రక్తహీనత ఉన్నట్టు గుర్తించిన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. బాధితులకు పౌష్టికాహారంతోపాటు తగిన మందులు అందించడం ద్వారా చాలా చోట్ల ప్రగతి కనిపించిందన్నారు. రక్తహీనతకు గల కారణాలు, ఆయా ప్రాంతాల్లో ఉన్న పరిస్థితులు, అవగాహన మొదలైనవన్నీ క్రోడీకరించి ప్రణాళికాయుతంగా తగిన చర్యలు చేపట్టాలన్నారు. రక్తహీనతతో ఉన్న గర్భిణులు, బాలికలు, చిన్న పిల్లలపై చేపట్టిన చర్యలు ఎంతవరకు ఫలవంతమైనవో గుర్తించాలన్నారు. స్వస్థత హెచ్చుతగ్గులను తులనాత్మకంగా బేరీజు వేసుకొని వారికి తగిన అవగాహన కలిగించాలన్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ ఎ.హేమంత్, సీపీవో జి.రామారావు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ అనంతలక్ష్మి, డీఈవో వెంకటలక్ష్మమ్మ, వైద్యులు, ఎంఈఓలు, సీడీపీఓలు పాల్గొన్నారు.

ఆట ఆరంభం

అడుదాం ఆంధ్రా కార్యక్రమం జిల్లాలో అట్టహాసంగా ప్రారంభమైంది. గ్రామ స్థాయిలో ఔత్సాహికులైన క్రీడాకారులకు అవకాశం కల్పిస్తే ప్రతిభ గల వారు వెలుగులోకి వస్తారని, వారికి తగిన శిక్షణ అందిస్తే ప్రపంచ స్థాయిలో రాణిస్తారన్న ఆశయంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ క్రీడా సంబరాలకు శ్రీకారం చుట్టారు. దేశంలోనే ఒక మైలురాయిగా నిలిచే క్రీడా సంరంభంలో పాల్గొనేందుకు జిల్లాలో లక్షా 31 వేల 41 మంది పేర్లు నమోదు చేసుకున్నారు. వార్డు సచివాలయ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ క్రీడాంశాల్లో నిర్వహించే ఈ పోటీలను ప్రతి నియోజకవర్గంలోను స్థానిక ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్తలు, అధికారులు మంగళవారం ప్రారంభించారు. డిసెంబర్ 26 నుంచి ఫిబ్రవరి 10వ తేదీ వరకు 47 రోజులపాటు ఈ పోటీలు జరగనున్నాయి. దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, అనకాపల్లిలోని ఎన్టీఆర్ క్రీడా మైదానంలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పోటీలను ప్రారంభించారు. అనకాపల్లిలో ప్రారంభ సూచనగా జరిగిన క్రికెట్ పోటీలో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి బౌలింగ్ చేయగా.. మంత్రి అమర్‌నాథ్ బ్యాటింగ్ చేశారు. చోడవరం ప్రభుత్వ హైస్కూల్ గ్రౌండ్‌లో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ పోటీలను ప్రారంభించి బ్యాడ్మింటన్ ఆడారు. – సాక్షి, అనకాపల్లి



మంత్రి గుడివాడ అమర్‌నాథ్ బ్యాటింగ్



కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి బౌలింగ్

- అన్ని నియోజకవర్గాల్లో ప్రారంభమైన క్రీడా సంబరాలు
- ఉత్సాహంగా పాల్గొన్న క్రీడాకారులు, ప్రజాప్రతినిధులు

యువతీ యువకుల్లో ఉన్న క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించేందుకు ప్రపంచ స్థాయి క్రీడాకారులను గుర్తించేందుకే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి 'ఆడుదాం- ఆంధ్రా' కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారని పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. మంగళవారం అనకాపల్లిని ఎన్టీఆర్ క్రీడా మైదానంలో నిర్వహించిన 'ఆడుదాం- ఆంధ్రా' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో అవకాశాలు లేని, వెలుగులోకి రాని ప్రతిభావంతులకు ఇది ఎంతో చక్కటి అవకాశమన్నారు. ఎంపీ సత్యవతి మాట్లాడుతూ ఆటల వల్ల ఆరోగ్యం, మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు.



బెలూన్లు ఎగురవేస్తున్న ముఖ్యఅతిథులు



బుచ్చెయ్యపేటలో రసవత్తరంగా వాలీబాల్ పోటీ

ఈ పోటీలతో అందరిలో క్రీడా స్ఫూర్తి వెల్లివిరుస్తుందన్నారు. కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ప్రారంభోపన్యాసం చేస్తూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారోగ్యం కోసం వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, జగనన్న ఆరోగ్య సురక్ష వంటి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. యువత ఆరోగ్యకర జీవనానికి 'ఆడుదాం- ఆంధ్రా' లాంటి క్రీడా సంబరాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. జిల్లాలో 14,098 టీముల్లోని లక్షా 31 వేల 41 మంది క్రీడాకారులు ఇప్పటి వరకు రిజిస్టర్ చేసుకున్నారని పేర్కొన్నారు. ఈ పోటీల నిర్వహణకు నెల రోజుల ముందు నుంచి జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు ప్రారంభించిందని తెలిపారు. అంతకుముందు జాతీయ, క్రీడా జెండాలను మంత్రి ఆవిష్కరించారు. ఆసియా క్రీడల్లో పవర్‌లిఫ్టింగ్‌లో కాంస్య పతకం సాధించిన బి.కుసుమ, జాతీయ బాక్సింగ్ పోటీల్లో కాంస్య పతకాన్ని దక్కించుకున్న బి.మౌనిక, వూషూ క్రీడలో జాతీయ జట్టులో పాల్గొని గెలుపొందిన జి.జ్యోతిలను మంత్రి, కలెక్టర్, ఎంపీలు శాలువాలతో సత్కరించారు. జేసీ జాహ్నవి, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి మంజులావాణి, ఆర్డీవో చిన్నికృష్ణ, జెడ్పీ వెంకటరమణ, జిల్లా క్రీడాధికారి ఎల్.రమణ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, కార్పొరేటర్లు కొణతాల నీలిమ, జాజుల ప్రసన్నలక్ష్మి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, పార్టీ నేతలు, కార్యకర్తలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

రేపు భారీ బైక్ ర్యాలీ

అనకాపల్లి: ఆడుదాం.. ఆంధ్రా క్రీడా సంబరంలో భాగంగా ఈనెల 28న పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్టు మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చెప్పారు. స్థానిక రింగ్‌రోడ్డు తన కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. ఈ ర్యాలీని ప్రముఖ క్రికెట్ క్రీడాకారుడు అంబటి రాయుడు ప్రారంభిస్తారని చెప్పారు. పూడిమడక రహదారిలో గల వైఎస్సార్ విగ్రహం వద్ద బైక్ ర్యాలీ ప్రారంభమవుతుందని, ఆర్టీసీ కాంప్లెక్స్, నెహ్రూచౌక్, వేల్పులవీధి, చినానాలుగు రోడ్ల జంక్షన్, రింగ్‌రోడ్డు మీదుగా పెంటకోట కన్వెన్షన్ హాలుకు చేరుకుంటుందన్నారు. ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, ఎంపీపీ గొర్లి సూరిబాబు, పార్టీ రాష్ట్ర వైద్యవిభాగం ప్రధాన కార్యదర్శి బొడ్డేడ లక్ష్మీనర్సింహారావు, ఎన్టీఆర్ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్లు జి.రామ్మూర్తి, మునూరు శ్రీను, గవర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బొడ్డేడ శివ పాల్గొన్నారు.

క్రీడా ప్రతిభను వెలికితీయడమే లక్ష్యం

దేవరాపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా ప్రతిభను వెలికి తీసి ఔత్సాహికులను ప్రోత్సహించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా సంబరాన్ని ఆయన ప్రారంభించారు. ముందుగా పాఠశాల ఆవరణలోని భారతరత్న అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. డిప్యూటీ సీఎంకు ఎన్‌సీసీ విద్యార్థులు మార్చ్‌ఫాస్ట్‌తో ఘన స్వాగతం పలికారు. అనంతరం వాలీబాల్ క్రీడా ప్రాంగణంలో రిబ్బన్ కత్తిరించి పోటీలను ప్రారంభించారు. రాష్ట్రంలో గ్రామ సచివాలయ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నిర్వహిస్తున్న క్రీడా పోటీలను ఔత్సాహికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రొంగలి నారాయణమ్మ, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు గొర్రుపోటు రమాదేవి, పార్టీ మండల అధ్యక్షుడు బూరె బాబూరావు, కొప్పల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డా. వి.సింహాచలంనాయుడు, స్థానిక సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, మండల ప్రత్యేక అధికారి వి.రవీంద్రనాథ్, ఎంపీడీవో సిహెచ్.సుబ్బలక్ష్మి, ఎంఈవోలు బి.పడాల్‌దాస్, ఉషారాణి, ఈవోపీఆర్డీ జి. సంతోషి నళిని, పంచాయతీ సెక్రటరీ ఎస్.శ్రీనివాసరావు తదితర్లు పాల్గొన్నారు.

ఆంధ్ర క్రీడాకారులు అగ్రగామిగా నిలవాలి

రాష్ట్ర క్రీడాకారులు దేశ విదేశాల్లో రాణించాలని, వారు అన్నింటా అగ్రగామిగా నిలవాలన్న లక్ష్యంతోనే ముఖ్యమంత్రి ఈ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. దేవరాపల్లిలోని రైవాడ అతిథి గృహం వద్ద స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటువంటి ప్రయత్నం దేశ చరిత్రలో ఇదే తొలిసారి అన్నారు. గ్రామ స్థాయి నుండి ఆరోగ్యకరమైన జీవన శైలిని ప్రోత్సహించేందుకు ఈ క్రీడా పోటీలు దోహదపడతాయన్నారు.



'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు



చోడవరం ప్రభుత్వ హైస్కూల్ గ్రౌండ్‌లో పోటీలు ప్రారంభించి బ్యాడ్మింటన్ ఆడుతున్న విప్ ధర్మశ్రీ

29న స్థాయీ సంఘ సమావేశం

డాబాగార్డెన్స్: జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం ఈ నెల 29న నిర్వహించనున్నారు. స్థాయీ సంఘ చైర్‌పర్సన్, మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన నిర్వహించనున్న సమావేశంలో 52 అంశాలు ఆమోదానికి రానున్నాయి. వీటిలో ప్రధానంగా జోన్-4 పరిధి రెల్లివీధి వాణిజ్య సముదాయంలో గల 2, 4వ దుకాణాలను మూడేళ్ల కాలానికి బహిరంగ వేలం ద్వారా ఇచ్చేందుకు, జడ్జి కోర్టు ఎదురుగా గల జీవీఎంసీ వాణిజ్య సముదాయంలో 8వ షాపును మూడేళ్ల కాలానికి బహిరంగ వేలం ద్వారా ఇచ్చేందుకు, నగర పరిధిలో పలు జోన్లలో గల రెవెన్యూ విభాగానికి సంబంధించి పలు దుకాణాలు బహిరంగ వేలం ద్వారా ఇచ్చేందుకు చర్చించనున్నారు. జాతీయ రహదారి ఆర్చ్ నుంచి సైమన్ నగర్ జంక్షన్ వరకు గల కూర్మన్నపాలెం రోడ్డుకు బీటీ హాట్‌మిక్స్ రోడ్డు విస్తరణకు అనుమతి ఇచ్చి చర్యలు జరుపుతారు.

వైద్యారోగ్య శాఖలో 8 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

మహారాణిపేట: వైద్య ఆరోగ్యశాఖలో మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్/కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. జోన్-1 పరిధిలో మొత్తం 8 పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేస్తున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ డైరెక్టర్ డాక్టర్ సుజాత తెలిపారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లలోని ఖాళీలను భర్తీ చేస్తున్నామని.. నెలకు రూ.25వేలు వేతనంగా అందిస్తామన్నారు. బీఎస్సీ(నర్సింగ్), బీఎస్(నర్సింగ్, సీపీసీహెచ్) చేసిన వారు ఈ పోస్టులకు అర్హులున్నారు.

ప్రతిభకు దర్పణం.. వైజ్ఞానిక ప్రదర్శన

- ఆకట్టుకున్న నమూనాలు
- జిల్లా స్థాయి విద్య, వైజ్ఞానిక ప్రదర్శనలను ప్రారంభించిన కలెక్టర్
- ఆసక్తిగా తిలకించిన ఎంపీ సత్యవతి



జిల్లాస్థాయి సైన్స్ ఫేర్‌కు జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, ఎంపీ సత్యవతి



విద్యార్థులు తయారుచేసిన ప్రాజెక్టులను పరిశీలిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

తుమ్మపాల: విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు విద్య, వైజ్ఞానిక ప్రదర్శనలు వేదికగా నిలుస్తాయని కలెక్టర్ రవిపట్టాన్ శెట్టి అన్నారు. పట్టణంలో జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి విద్య, వైజ్ఞానిక ప్రదర్శనను ఎంపీ బీవీ సత్యవతితో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్ర, సాంకేతిక రంగాల్లో విద్యార్థులకు అవగాహన కల్పించి సృజనాత్మకతను వెలికితీసి ప్రాజెక్టులు రూపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. నేటి విద్యార్థులే రేపటి శాస్త్రవేత్తలని అభివర్ణించారు. విజ్ఞాన ప్రదర్శనల ద్వారా జిల్లాలోని పాఠశాలల బోధన సామర్థ్యాన్ని విద్యాశాఖ అంచనా వేయాలన్నారు. అందుకనుగుణంగా భవిష్యత్తు ప్రణాళికను రూపొందించాలని ఆదేశించారు. ప్రదర్శన నిర్వహణకు కృషి చేసిన అధ్యాపకులను అభినందించారు. ఎంపీ బీవీ సత్యవతి మాట్లాడుతూ విద్య అంటే మూఢవిశ్వాసాలను నమ్మకుండా దృష్టాంత మూలంగా గ్రహించగలగాలన్నారు. గురువుల బోధనలను ఆకళింపు చేసుకుని ఉన్నతంగా ఎదగాలన్నారు. నాడు-నేడు పథకం ద్వారా పాఠశాలల రూపురేఖలు మార్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందన్నారు. విద్యార్థిగా ఉన్నప్పుడు తాను సైన్స్ ఫెయిర్‌లో పాల్గొని పలు ప్రాజెక్టులు చేసిన జ్ఞాపకాలను విద్యార్థులతో పంచుకున్నారు. అంతకుముందు కలెక్టర్, ఎంపీ వైజ్ఞానిక ప్రదర్శనలను పరిశీలించారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జెడ్పీ పాఠశాలల నుంచి మొత్తం 72 ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించారు. ప్రతి ప్రాజెక్టును కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యాశాఖ ఏడీ రవిబాబు, డీఈవో ఎం.లక్ష్మమ్మ, ఎలమంచిలి డిప్యూటీ డీఈవో అప్పారావు, ఎంఈవోలు చిట్టిబాబు, కోటేశ్వరరావు, పాఠశాల హెచ్‌ఎం బ్రహ్మాజీ పాల్గొన్నారు.

సింగిల్ కేటగిరిలో..

మొదటి స్థానంలో జెడ్పీ హైస్కూల్ తోటాడకు చెందిన ఎస్.హరిణి (నమూనా : స్మార్ట్ సీడెడ్ డ్రిల్లర్), రెండో స్థానంలో ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్ కోక్కిరాపల్లికి చెందిన ఎస్.లావణ్య (నమూనా: ఎయిర్ క్వాలిటీ, ప్యూరిఫెయింగ్ సిస్టమ్), మూడో స్థానంలో ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్ దేవరాపల్లికి చెందిన కె.వంశీ (నమూనా : గ్రీన్ బెల్ట్ బిల్డింగ్స్ ప్రాజెక్టు) నిలిచారు.

గ్రూప్ కేటగిరిలో..

మొదటి స్థానంలో జెడ్పీహెచ్‌ఎస్ ఎస్.రాయవరానికి చెందిన ఎం.జేసురామ్, పి.గోపి, రెండో స్థానంలో జెడ్పీహెచ్‌ఎస్ నక్కపల్లికి చెందిన కె.జయవర్ధన్, పి.జయదుర్గా, మూడో స్థానంలో జెడ్పీహెచ్‌ఎస్ ధర్మారాయుడుపేటకు చెందిన పి.సాయిబాలాజీ, ఆర్.భానుతేజ నిలిచారు.

టీచర్స్ కేటగిరిలో..

మొదటి స్థానం జెడ్పీహెచ్‌ఎస్ కోరుప్రోలు ఉపాధ్యాయుడు రఘురమేష్, జెడ్పీహెచ్‌ఎస్ నంగినారపాటు ఉపాధ్యాయుడు పోకూరి శ్రీనివాసరావు, జెడ్పీహెచ్‌ఎస్ తుమ్మపాల ఉపాధ్యాయుడు బీకేవీ గోవిందరావు నిలిచారు.

రాష్ట్ర స్థాయికి ఎంపిక

నక్కపల్లి: అరటి దవ్వను వ్యవసాయ వ్యర్థంగా కాకుండా వనరుగా ఉపయోగించే ప్రాజెక్టు రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపికైంది. స్థానిక ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు తయారు చేసిన ఈ ప్రాజెక్టు మంగళవారం అనకాపల్లిలో జరిగిన జిల్లాస్థాయి సైన్స్‌ఫేర్‌లో ఆకట్టుకుంది. త్వరలో కడపలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఈ ప్రాజెక్టును ప్రదర్శిస్తారని ఎంఈవో కుంచం నరేష్ చెప్పారు. ఉపాధ్యాయులు సుమబిందు పర్యవేక్షణలో విద్యార్థులు జయవర్ధన్, జయదుర్గ, నానాజీలు పాల్గొన్నారు.



విజేతలకు ప్రశంసాపత్రం అందజేస్తున్న డీఈవో

మౌలిక వసతులు కల్పిస్తాం

- ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్
- యలమంచిలిలో టిడ్కో గృహాల పరిశీలన



గృహాలను పరిశీలిస్తున్న టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్

యలమంచిలి : టిడ్కో గృహాల సముదాయం వద్ద మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర టిడ్కో గృహాల సంస్థ చైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్ అన్నారు. మంగళవారం యలమంచిలి పట్టణం యర్రవరం సమీపంలో జాతీయ రహదారి పక్కన టిడ్కో గృహాల సముదాయాన్ని ఆయన సందర్శించారు. లబ్ధిదారులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. తాగునీటి సమస్య నెలకొందని ఆయన దృష్టికి పలువురు లబ్ధిదారులు తీసుకెళ్లగా సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి వారం రోజుల్లో కొత్త మోటార్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. టిడ్కో గృహాల సముదాయంలో గృహప్రవేశం జరుపుకున్న ఇంట్లో ఆయన లబ్ధిదారులతో కలిసి భోజనం చేశారు. జాతీయ రహదారి పక్కన కోట్ల విలువైన స్థలాన్ని పేదలకు గృహాలు నిర్మించి ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందన్నారు. టిడ్కో గృహాలకు అధిక నిధులు వెచ్చించి పేదలకు అందజేశారన్నారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం టిడ్కో గృహాల నిర్మాణంలో జాప్యం చేసిందని, లబ్ధిదారులకు అందించడంలో విఫలమైందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆపరేషన్ పరివర్తనతో గంజాయి నిర్మూలన



మాట్లాడుతున్న డీఐజీ ఎస్.హరికృష్ణ

అనకాపల్లి: విశాఖ పోలీస్ రేంజ్ పరిధిలో కొత్తగా ఏడు పోలీస్‌స్టేషన్లను ప్రభుత్వ ఆదేశాలు మేరకు అప్‌గ్రేడ్ చేయనున్నట్టు డీఐజీ ఎస్.హరికృష్ణ అన్నారు. పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో మంగళవారం మీడియాతో ఆయన మాట్లాడారు. ఆపరేషన్ పరివర్తన కార్యక్రమాన్ని 2021లో ఏర్పాటు చేసి, రేంజ్ పరిధిలో గంజాయి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో 8 మండలాల్లో ఎక్కువగా గంజాయి సాగు ఉండేదని, వివిధ ప్రభుత్వశాఖల అధికారుల సహకారంతో గంజాయి సాగును నిర్మూలిస్తు, గిరిజన రైతులకు ప్రత్యేక పంటలపై అవగాహన కల్పించామన్నారు. ఆర్‌బీకేల ద్వారా రైతులకు విత్తనాలు అందజేస్తున్నట్టు చెప్పారు. ఒడిశా రాష్ట్రంలో మల్కన్‌గిరి, కోరాపుట్ జిల్లాల నుంచి ఆంధ్ర రాష్ట్రానికి గంజాయి రవాణా జరుగుతోందని, ఎక్కడికక్కడ చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి, రవాణా చేస్తున్న వ్యక్తులపై పీడీ కేసులు నమోదు చేస్తున్నామన్నారు. కోరాపుట్ డీఐజీతో ఈ అంశంపై ఎప్పటికప్పుడు మాట్లాడుతున్నామన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వ్యక్తులు గంజాయి రవాణాకు పాల్పడుతున్నట్లు ఆయన తెలిపారు. అనకాపల్లి డీఎస్పీ నూతన కార్యాలయ పనులు త్వరలో పూర్తి చేస్తామన్నారు. పట్టణ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఉన్న పోలీస్ క్వార్టర్స్ శిథిలావస్థకు చేరుకున్న విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ కేవీ.మురళీకృష్ణ, డీఎస్పీ వి.సుబ్బరాజు పాల్గొన్నారు.

డీఐజీ కె.హరికృష్ణ మండలంలో రూరల్ పోలీస్‌స్టేషన్‌ను కూడా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సచివాలయ సంరక్షణ కార్యదర్శుల సహాయంతో బాల్యవివాహాలను అరికట్టి, సైబర్ క్రైంను నియంత్రించగలిగామని చెప్పారు. డీఎస్పీ వి.సుబ్బరాజు, ట్రెయినీ డీఎస్పీ భవ్య, రూరల్ సీఐ రవికుమార్, పట్టణ సీఐ టి.శ్రీను ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

గంజాయి బ్యాగు స్వాధీనం


గంజాయి బ్యాగు

యలమంచిలి రూరల్: మండలంలోని సోమన్న పాలెం గ్రామ సమీపంలో మంగళవారం రాత్రి గంజాయి బ్యాగును స్వాధీనం చేసుకున్నట్లు యలమంచిలి రూరల్ ఎస్ఐ కె.సన్నిబాబు తెలిపారు. తమ గ్రామానికి సమీపంలో పాత జాతీయ రహదారి పక్కన బ్యాగులో గంజాయి ఉన్నట్లు గ్రామస్తులు ఎస్ఐకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు సిబ్బందితో వెళ్లిన ఎస్ఐ ఓ బ్యాగులో ప్యాకెట్లుగా ఉన్న గంజాయిని గుర్తించారు. సమీపంలో ఉన్న నలుగురు అనుమానితులను అదుపులోకి తీసుకుని, బ్యాగు గురించి ప్రశ్నించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బాలుడిపై పోక్సో కేసు

సీతమ్మధార: ద్వారకా పోలీస్‌స్టేషన్‌లో ఓ బాలుడిపై పోక్సో కేసు నమోదైంది. చిన్నవాల్తేరు పరిధి రెల్లివీధికి చెందిన బాలుడు సీతంపేటలో ఉంటున్న బాలికను ప్రేమించాడు. మాయ మాటలు చెప్పి కొద్ది రోజు కిందట ఆమెను ఇంటి నుంచి తీసుకెళ్లిపోయాడు. బాలిక తల్లిదండ్రులు ద్వారకా పోలీస్‌స్టేషన్‌లో బాలిక అదృశ్యంపై ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేసి ఇద్దరూ నిడదవోలులో ఉన్నట్లు గుర్తించారు. అక్కడి నుంచి వారిని నగరానికి తీసుకొచ్చారు. విచారణలో బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్లు తేలడంతో బాలుడిపై పోక్సో కేసు నమోదు చేసి, అరెస్ట్ చేశారు.

అసైన్డ్ భూములకు సర్వహక్కులు చరిత్రాత్మకం

- రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా డీ పట్టా భూములకు హక్కు పత్రాలు
- తారువలో భూహక్కు పత్రాల పంపిణీలో డిప్యూటీ సీఎం బూడి


తారువలో రైతులకు భూ హక్కు పత్రాలను అందిస్తున్న ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: అసైన్డ్ భూముల్ని సాగు చేస్తున్న రైతులకు యాజమాన్య హక్కులు కల్పించి, భూ హక్కు పత్రాలు పంపిణీ చేయడం చారిత్రాత్మకమని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. మండల స్థాయిలో అసైన్డ్(డీ పట్టా) భూములు సాగు చేసుకుంటున్న రైతులకు భూ యాజమాన్య హక్కు పత్రాలను మంగళవారం తారువలో ఆయన పంపిణీ చేశారు. మండలంలో 20 ఏళ్లకు పైబడి సాగు చేసుకుంటున్న 180 ఎకరాల డీ పట్టా భూములకు సంబంధించి 179 మంది రైతులకు భూ యాజమాన్య హక్కు పత్రాలను, 19 ఎకరాలకు సంబంధించి 56 మంది రైతులకు పట్టాలను డిప్యూటీ సీఎం అందించారు. అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెవెన్యూ వ్యవస్థలో చారిత్రక మార్పులకు శ్రీకారం చుట్టారని తెలిపారు. భూమిలేని నిరుపేదలకు భూమిని పంపిణీ చేయడంతో పాటు 20 ఏళ్లుగా డీ-పట్టా భూములను సాగు చేసుకుంటున్న రైతులకు జిరాయితీ భూములతో సమానంగా సర్వ హక్కులు కల్పించడం ఆనందంగా ఉందన్నారు. దీంతో ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న రైతులకు తమ సొంత అవసరాలకు భూమిని విక్రయించే అవకాశం లభించిందన్నారు. అన్నదాతలను ఆదుకోవడంలో సీఎం జగన్‌కు మరెవ్వరూ సాటి లేరనడానికి ఈ విప్లవాత్మక నిర్ణయాలే నిదర్శనమన్నారు. ఏటా అర్హులైన రైతులకు డి-పట్టాలు, భూ యాజమాన్య హక్కు పత్రాలను ప్రభుత్వం పంపిణీ చేస్తుందన్నారు. యాజమాన్య హక్కు పత్రాలు, డీ పట్టాలు పొందిన రైతుల తరపున సీఎం జగన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఈర్లె అనురాధ, స్థానిక ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రొంగలి నారాయణమ్మ, తహసీల్దార్ ఎం.లక్ష్మి, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు గొర్రుపోటు రమాదేవి, మండల అధ్యక్షుడు బూరె బాబూరావు, యువజన అధ్యక్షుడు కర్రి సూరినాయుడు, వైస్ ఎంపీపీ ఉగ్రాకుల గంగాభవానీ, సర్పంచ్ టోకురి రామకృష్ణ, దొమ్మంగి శ్రీనివాసరావు, పోడెల నానిబాబు, ఎంపీటీసీ పంచాడ సింహాచలంనాయుడు, బండి గౌరమ్మ తదితర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

చేపల ఎగుమతులు పెరగాలి



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి పర్షోత్తమ్ రూపాలా, చిత్రంలో రాష్ట్ర మంత్రి సీదిరి అప్పలరాజు

మహారాణిపేట (విశాఖ): చేపల ఎగుమతులను పెంచాలని కేంద్ర మత్స్యకార, పశుసంవర్ధక, పాడి పరిశ్రమల శాఖ మంత్రి పర్షోత్తమ్ రూపాలా పిలుపునిచ్చారు. జాతీయ మత్స్య అభివృద్ధి బోర్డు (ఎన్ఎఫ్‌డీబీ) 10వ పాలక మండలి సమావేశం మంగళవారం నగరంలోని గ్రీన్‌పార్క్ హోటల్‌లో జరిగింది. ఈ సమావేశానికి కేంద్రమంత్రి అధ్యక్షత వహించగా.. ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాల మత్స్యశాఖ మంత్రులు డాక్టర్ సీదిరి అప్పలరాజు, మంకల్ ఎస్ వైద్య, త్రిపుర, ఉత్తరాఖండ్, పంజాబ్ రాష్ట్రాల మత్స్యశాఖ అధికారులు, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు. కేంద్ర కార్యదర్శి అభిలాక్ష లిఖి, సంయుక్త కార్యదర్శి నీతు క్మారీ ప్రసాద్, ఎన్ఎఫ్‌డీబీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ డాక్టర్ ఎల్.నరసింహమూర్తి, 13 మంది నామినేట్ చేసిన నాన్-అఫీషియల్ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ రొయ్యల ఎగుమతికి పలు రాష్ట్రాలు ఎంతో ప్రాధాన్యమిస్తున్నాయని.. వీటికి మార్కెట్‌లో కూడా అధిక డిమాండ్ ఉందన్నారు. రొయ్యల సాగు మాదిరిగానే చేపల ఉత్పత్తి ఎక్కువగా ఉందన్నారు. చేపలను కూడా అధికంగా ఎగుమతి చేయాలని సూచించారు. డీప్ సీ ఫిషింగ్, సంప్రదాయ ప్రాసెసింగ్ యూనిట్లు, మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసే అవకాశాలను అన్వేషించడానికి ఓ విధానాన్ని రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు.

గంజాయి అక్రమ రవాణాపై చర్యలు


రికార్డులు పరిశీలిస్తున్న నర్సీపట్నం ఏఎస్పీ

గొలుగొండ: గంజాయి అక్రమ రవాణాతోపాటు, ప్రమాదాల నివారణకు అన్ని చర్యలు తీసుకోవాలని నర్సీపట్నం ఏఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా పోలీసులను ఆదేశించారు. ఆయన మంగళవారం గొలుగొండ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల నుంచి గంజాయి అక్రమ రవాణాపై పూర్తి స్థాయిలో నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ప్రమాదాల నివారణకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. సిబ్బంది బాధ్యతగా పనిచేసి, ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఆయనతో గొలుగొండ ఎస్ఐ నారాయణరావు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

వైభవంగా దత్తాత్రేయ గిరి ప్రదక్షిణ


తేగాడ వద్ద దత్తాత్రేయ పల్లకితో గిరి ప్రదక్షిణ చేస్తున్న భక్తులు


భక్తుల పూజలందుకున్న దత్తాత్రేయుడు

కశింకోట: మండలంలోని తేగాడ వద్ద ప్రసిద్ధి చెందిన చెందిన దత్తాత్రేయ స్వామి ఆలయ గిరి ప్రదక్షిణ మంగళవారం వైభవంగా జరిగింది. దాదాపు పది కిలోమీటర్ల మేర వేల మంది భక్తులతో ఈ ప్రదక్షిణ సాగింది. దత్తాత్రేయ జయంతి పురస్కరించుకుని ఆలయం నుంచి దత్తాత్రేయ చిత్ర పటాన్ని పల్లకిలో నిలిపి ప్రదక్షిణ ప్రారంభించారు. తేగాడ, పేరంటాల పాలెం, కొత్తపల్లి, బుచ్చియ్యపేట, బయ్యవరం గేటు, బయ్యవరం గ్రామం మీదుగా తిరిగి ఆలయం వరకు ఈ ప్రదక్షిణ సాగింది. దత్తాత్రేయ నామ స్మరణతో భజనలు చేస్తూ భక్తులు సాగారు. వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ గిరి ప్రదక్షిణలో పాల్గొని పల్లకీ మోశారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకుడు వేదుల శంకర భరద్వాజ్, ప్రధాన అర్చకుడు గుళ్లపల్లి శివకుమార్‌లు హారతిచ్చి గిరి ప్రదక్షిణకు ముగింపు పలికారు. భక్తులు స్వామిని దర్శించి, పూజలు చేశారు. జయంతి పురస్కరించుకుని స్వామి విగ్రహాన్ని అందంగా పూలతో అలంకరించి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామిని దర్శించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందసత్యనారాయణ స్వామిని దర్శించి పూజలు చేశారు. ఆలయం ముందున్న అంజూర వృక్షానికి భక్తులు ప్రదక్షిణలు చేశారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన జరిగింది. సర్పంచ్ నీటిపల్లి ఈశ్వరమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు మంగతాయారు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నీటిపల్లి లక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకుడు నీటిపల్లి దివాకర్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు వేగి దొరబాబు, తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి గొంతిన శ్రీనివాసరావు, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు వేగి గోపీకృష్ణ, డీసీసీబీ మాజీ డైరెక్టర్ సిదిరెడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సనాతన ధర్మం ప్రపంచానికి ఆదర్శం

శ్రీకృష్ణ చరణానంద భారతీ స్వామి


భక్తులకు అనుగ్రహ భాషణం చేస్తున్న స్వామీజీ

నక్కపల్లి: సనాతనమైన హిందూ ధర్మం ప్రపంచానికే ఆదర్శమని, మనిషి జీవన విధానం, కుటుంబ వ్యవస్థ, సమాజం ఎలా ఉండాలో చాటిచెబుతుందని యాజ్ఞవల్క్య రాజాశ్రమ పీఠాధిపతి, సనాతన ధర్మ పరిషత్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షులు శ్రీకృష్ణచరణానంద భారతీస్వామి అన్నారు. ఉపమాక వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద మంగళవారం మధ్యాహ్నం హిందూ ధార్మిక సదస్సులో ముఖ్యఅతిథిగా హాజరై అనుగ్రహ భాషణం చేశారు. శ్రీకృష్ణ భగవానుడు అర్జునుడికి బోధించిన భగవద్గీతను పాటించిన వారి జీవన విధానం అద్భుతంగా ఉంటుందన్నారు. వ్యక్తి నడవడిక, కుటుంబ వ్యవస్థ ఎలా ఉండాలో భగవద్గీత నేర్పుతుందని చెప్పారు. హిందూ ధర్మప్రచారంలో ఎస్ఎస్ఎఫ్ సేవలు అమోఘమని కొనియాడారు. హైదరాబాద్‌కు చెందిన గ్రూప్ ఆఫ్ కంపెనీ చైర్‌పర్సన్ కె.మాధవీలత మాట్లాడుతూ మన సనాతన ధర్మం ఎంతో మంది పురాణ పురుషులను ఈ పుడమికి అందించిందన్నారు. భార్యాభర్తల మధ్య ఎప్పుడూ ఐకమత్యం, అవగాహన ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రొఫెసర్ ముర్రు ముత్యాలనాయుడు, డాక్టర్ గాయత్రీదేవి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేష్ పాల్గొన్నారు.

రూ.2.20 కోట్లతో రైల్వే స్టేషన్ రోడ్డు విస్తరణ

ఈ నెల 28న పనులకు శంకుస్థాపన-ఎమ్మెల్యే కన్నబాబు


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నబాబు

యలమంచిలి రూరల్: వీఎంఆర్‌డీఏ నిధులు రూ.2.20 కోట్లతో పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డు ఆధునికీకరణ, విస్తరణ పనులు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే కన్నబాబు చెప్పారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో యలమంచిలి పట్టణ అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను ఆయన వివరించారు. ఈ నెల 28న రైల్వేస్టేషన్ రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తామన్నారు. ప్రస్తుతం ఉన్న రోడ్డును 50 అడుగులకు విస్తరించనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తయిందన్నారు. ఈ పనులను ఫిబ్రవరి నెలకల్లా పూర్తి చేయనున్నట్టు తెలిపారు. పట్టణంలోని మెయిన్ రోడ్డు విస్తరణ పనులకు కూడా త్వరలో శ్రీకారం చుట్టనున్నట్లు చెప్పారు. పట్టణ సమగ్రాభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. యలమంచిలి మేజర్ పంచాయతీగా ఉన్నపుడు తన హయాంలో రైల్వేస్టేషన్ రోడ్డు విస్తరణ పనులు జరిగాయని, ఇపుడు మళ్లీ తన కృషితోనే ఈ రోడ్డు పనులు చేయించే అవకాశం దక్కడం ఆనందంగా ఉందన్నారు. సమావేశంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, మున్సిపల్ వైస్ చైర్మన్లు అర్రెపు సత్యగుప్తా, బెజవాడ నాగేశ్వరరావు, ఎంపీపీ బోదెపు గోవింద్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొద్దపు ఎర్రయ్యదొర, మున్సిపల్ కమిషనర్ కొండలరావు పాల్గొన్నారు.

స్కై మార్షల్ పోటీల్లో రోలుగుంట బాలల సత్తా


విజేతలను అభినందిస్తున్న స్కైమార్షల్ సంఘ జిల్లా అధ్యక్షుడు వనం సన్యాసిరావు

రోలుగుంట: స్కై మార్షల్ ఆర్ట్స్ స్టేట్ లెవల్ పోటీల్లో మండలానికి చెందిన 24 మంది బాలబాలికలు పాల్గొని, తమ సత్తాచాటి, స్వర్ణ, రజత, కాంస్య పతకాలు సాధించినట్లు స్కై మార్షల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వనం సన్యాసిరావు మంగళవారం తెలిపారు. ఇటీవల జిల్లా స్థాయి పోటీల్లో మండలం నుంచి పాల్గొన్న వారిలో 24 మంది విజేతలుగా నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. వీరు ఈ నెల 24, 25 తేదీల్లో చిత్తూరులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచి పతకాలు సాధించినట్లు వెల్లడించారు. అండర్-11, 14, 18 బాలబాలికల వెయిట్ కేటగిరీలలో 5 స్వర్ణ, 12 రజత, 7 కాంస్య పతకాలు సాధించిన వీరిని మర్రిపాలెంలో అధ్యక్షుడు సన్యాసిరావు, కోచ్ హేమసాయి, రోలుగుంట పీడీ గోవింద అభినందించారు.

విశాఖ డెయిరీ సేవలు భేష్

- కేంద్ర పాడి పరిశ్రమ శాఖ మంత్రి పర్షోత్తమ్ రూపాలా
- విశాఖ డెయిరీ ట్రస్ట్ ఆస్పత్రిలో క్యాన్సర్ విభాగానికి శంకుస్థాపన
- తులసీరావుకి పద్మశ్రీ ఇవ్వాలి: డిప్యూటీ సీఎం బూడి


పాల ఉత్పత్తులను పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి పర్షోత్తమ్ రూపాల, విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్


విశాఖ డెయిరీలో దివంగత తులసీరావు విగ్రహాన్ని ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి రూపాల, రాష్ట్రమంత్రి అమర్‌నాథ్

సాక్షి, విశాఖపట్నం: పాడి రైతులకు వినూత్న సేవలందిస్తూ.. పాల ఉత్పత్తి రంగంలో విశాఖ డెయిరీ అగ్రగామిగా నిలుస్తోందని కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, పాడి పరిశ్రమ శాఖ మంత్రి పర్షోత్తమ్ రూపాలా అన్నారు. షీలానగర్‌లోని విశాఖ డెయిరీ ట్రస్ట్ ఆస్పత్రిలో క్యాన్సర్ విభాగం ఏర్పాటుకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. అక్కిరెడ్డిపాలెంలోని విశాఖ డెయిరీలో దివంగత ఆడారి తులసీరావు విగ్రహాన్ని ప్రస్తుత చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్, రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీలు బీశెట్టి సత్యవతి, జీవీఎల్ నరసింహారావు, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, మేయర్ గొలగాని హరివెంకట కుమారి, ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, తిప్పల నాగిరెడ్డి, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజుతో కలిసి కేంద్ర మంత్రి ప్రారంభించారు. విశాఖ డెయిరీలో పలు యూనిట్లను ఆయన పరిశీలించి మాట్లాడారు. దేశంలో ఏపీతో పాటు గుజరాత్‌లో డెయిరీ రంగం అభివృద్ధి చెందుతోందన్నారు. విశాఖ డెయిరీని ఆడారి తులసీరావు ఎంతో ఉన్నత స్థానానికి తీసుకువెళ్లారన్నారు. పాడి రైతులకు అండగా కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర జిల్లాల రైతుల ఆరాధ్య దైవం ఆడారి తులసీరావు అని కొనియాడారు. తులసీరావుకు పద్మశ్రీ ఇవ్వాలని కేంద్రమంత్రిని కోరారు. తండ్రి బాటలోనే ఆడారి ఆనంద్ కుమార్ ప్రయాణం సాగిస్తున్నారన్నారు. ఆనంద్ కుమార్ మాట్లాడుతూ రైతుల అభ్యున్నతి కోసం విశాఖ డెయిరీ ఎప్పుడూ కట్టుబడి ఉంటుందన్నారు. యలమంచిలి మున్సిపల్ చైర్మన్ పిల్ల రమాకుమారి, ప్రభుత్వ సలహాదారుడు(స్కిల్ డెవలప్‌మెంట్) గాది శ్రీధర్ రెడ్డి, డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కె.సతీష్, విశాఖ డెయిరీ ఎండీ ఎస్.వి.రమణ, కార్పొరేటర్లు, డెయిరీ ఉద్యోగులు పాల్గొన్నారు.

నిశితంగా పరిశీలించి అనుమతులివ్వండి

ఏఆర్‌టీ, సరోగసీ జిల్లా కమిటీ సమావేశంలో కలెక్టర్ ఆదేశం


మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట: జిల్లాలో 14 అసిస్టెడ్ రిప్రొడక్టివ్ టెక్నాలజీ(ఏఆర్‌టీ), సరోగసీ కేంద్రాల ఏర్పాటుకు దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం ఏఆర్‌టీ, సరోగసీ జిల్లా కమిటీ, జిల్లా మెడికల్ బోర్డు సంయుక్త సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్న ఈ కేంద్రాలను నిశితంగా పరిశీలించి అనుమతులివ్వాలని డీఎంహెచ్‌వో జగదీశ్వరరావును ఆదేశించారు. కేజీహెచ్ గైనిక్ హెచ్‌వోడీ డా.సంధ్యాదేవి, పిల్లల విభాగ వైద్యుడు డా.చక్రవర్తి, ఎన్‌జీవో ఎల్‌వీ రమణి, జిల్లా ఇమ్యూనైజేషన్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.జీవన్‌రాణి, మహిళా ఆరోగ్య అధికారి డా. బి.ఉమావతి, మీడియా విస్తరణ అధికారి నాగేశ్వరరావు, నాగభూషణం పాల్గొన్నారు.

జిందాల్‌తో ఎంవోయూ రద్దు చేయాలి

- ఉక్కు కార్మిక సంఘాల ధర్నా
- అడ్మిన్ బిల్డింగ్ వద్ద ఉద్రిక్తత


ఉక్కు అడ్మిన్ కూడలి వద్ద బైఠాయించిన కార్మిక నాయకులు


అడ్మిన్ బిల్డింగ్ ముందున్న ఫెన్సింగ్‌పై అభ్యంతరం వ్యక్తం చేస్తున్న నాయకులు

ఉక్కునగరం: జిందాల్‌తో స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం చేసుకున్న ఎంవోయూ రద్దు చేయాలని స్టీల్‌ప్లాంట్ కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. జిందాల్‌తో ఒప్పందానికి నిరసనగా మంగళవారం కార్మిక సంఘాల ఆధ్వర్యంలో అడ్మిన్ బిల్డింగ్ ముట్టడి కార్యక్రమం చేపట్టారు. కార్మిక నాయకులు, కార్మికులు పెద్ద ఎత్తున బైఠాయించడంతో జనరల్ షిఫ్టుకు వెళ్తున్న ఉద్యోగులు నిలిచిపోయారు. సౌత్ ఏసీపీ టి.త్రినాథ్ నేతృత్వంలో స్టీల్‌ప్లాంట్ సీఐ వి.శ్రీనివాసరావు పర్యవేక్షణలో గాజువాక, స్టీల్‌ప్లాంట్, న్యూపోర్టు, దువ్వాడ, పరవాడ స్టేషన్ల సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. కార్మికుల ఆగ్రహం చూసి పోలీస్ శాఖ అడ్మిన్ బిల్డింగ్ ముందు ఫెన్సింగ్ వేశారు. దీంతో కార్మిక నాయకులు పోలీసులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫెన్సింగ్ అంశం ఇరువర్గాల మధ్య ఉద్రిక్తతకు దారి తీసింది. నాయకులు ఫెన్సింగ్‌ను బలవంతంగా తొలగిస్తుండగా వారి ప్రయత్నాలను పోలీసులు అడ్డుకున్నారు. ఈలోగా ఏసీపీ త్రినాథ్ అక్కడకు చేరుకొని ఫెన్సింగ్ కొంత మేర తొలగించడంతో పాటు ఉక్కు యాజమాన్యం ప్రతినిధులను ఒప్పించి గేటు వద్దకు రప్పించేలా దౌత్యం చేశారు. దీంతో స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ (ఐఆర్) జీఎం కె.సంజీవరావు గేటు వద్దకు వచ్చి జిందాల్ ఈవోఐ ప్రక్రియను వివరించారు. వాటి వివరాలను వెల్లడించి మరిన్ని వివరాలకు సీఎండీ కార్యాలయానికి వచ్చి పత్రాలను చూడవచ్చన్నారు. ఆయన సమాధానంతో సంతృప్తి చెందని కార్మిక నాయకులు ఈ నెల 29లోగా ఒప్పందం రద్దు చేయకపోతే 30న తమ కుటుంబాలతో ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ అభివృద్ధికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న సీఎండీ అతుల్ భట్‌ను రీకాల్ చేయాలని డిమాండ్ చేశారు. జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ జిందాల్ ఒప్పందంలో రూ.వెయ్యి కోట్ల కుంభ కోణం ఉందని ఆరోపించారు. నీరుకొండ రామచంద్రావు మాట్లాడుతూ కార్మికుల సంక్షేమానికి వ్యతిరేకంగా యాజమాన్యం వ్యవహరిస్తోందన్నారు. వై.మస్తానప్ప మాట్లాడుతూ సీఎండీ వచ్చిన దగ్గర నుంచి హామీలు ఇవ్వడం తప్ప వాటిని అమలు చేయడం లేదన్నారు. అనంతరం ఉద్యోగులు విధులకు హాజరయ్యారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు కె.ఎస్.ఎన్.రావు, కారు రమణ, యు.రామస్వామి, వై.టి.దాస్, జె.రామకృష్ణ, బీఎంఎస్ నాయక్, కొమ్ము ప్రసాద్, చీకటి శ్రీనివాస్, సన్యాసిరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

భోగలింగేశ్వరస్వామి హుండీ లెక్కింపు



హుండీ లెక్కిస్తున్న ఆలయ ధర్మకర్తలు, సిబ్బంది

అనకాపల్లి: పట్టణంలో గవరపాలెం భోగలింగేశ్వరస్వామి హుండీ లెక్కింపు మంగళవారం జరిగింది. కార్తీకమాసం నెలరోజులు రూ.65,424 హుండీ ఆదాయం వచ్చినట్టు ఆలయ ఈవో కె.ఆదినారాయణ చెప్పారు. అరబ్ దేశానికి సంబంధించిన కరెన్సీ నోట్లు హుండీ లెక్కింపులో బయటపడినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఆళ్ల నాగేశ్వరరావు, ధర్మకర్తలు, సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ నేతతో బీజేపీ నేతల భేటీ

అనకాపల్లి: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ప్రాంత సహ ప్రచారక్ జనార్దన్‌జీని స్థానిక విజయరెసిడెన్సీలో మంగళవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సత్యనారాయణ మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శులు వర్మ, చదరం నాగేశ్వరరావు, పట్టాబి ప్రసాద్, బి.నాగేశ్వరరావు, జి.హరిరాజు, మూర్తి, అప్పారావు, రామరాజు పాల్గొన్నారు.

దత్తాత్రేయ స్వామికి పల్లకీ సమర్పణ



నాగమణిని సత్కరిస్తున్న ఎంపీటీసీ సభ్యురాలు మంగతాయారు తదితరులు

కశింకోట: తేగాడ గ్రామంలో వెలసి ఉన్న దత్తాత్రేయ స్వామికి కొత్తగా పల్లకీని సమకూర్చారు. ఇదే గ్రామానికి చెందిన కొమ్మోజు నానాజీ, నాగమణి దంపతులు సుమారు రూ.10 వేలు వెచ్చించి చెక్కతో తయారు చేసిన పల్లకీని స్వామి ఊరేగింపు సేవ కోసం అందించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ నాగమణి దంపతులను సత్కరించారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ నీటిపల్లి లక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు మంగతాయారు, వైఎస్సార్ సీపీ నాయకుడు నీటిపల్లి దివాకర్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

ఆక్వామెన్(తెలుగు): రాజా	
సలార్	: సత్యనారాయణస్క్రీన్-1
ఆక్వామెన్(తెలుగు-3డీ)	: సత్యనారాయణస్క్రీన్-2
హాయ్ నాన్న	: షిర్డిసాయి
సలార్	: పర్తిసాయి
మంగళవారం	: వెంకటేశ్వర
తికమక తాండ	: శ్రీసత్య
సలార్	: రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు మంగళవారం 3,545 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	4,400	5,180
మొదటి రకం	4,500	4,690
రెండో రకం	4,310	4,500
మూడోరకం	3,900	4,300

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 31 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-4 యూనిట్లు, బీ పాజిటివ్-7 యూనిట్లు, ఓ పాజిటివ్-19 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషన్ యు.లోకేష్(9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 418 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 363 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

ఉత్సాహంగా 'ఆడుదాం..ఆంధ్రా' పోటీలు



క్రీడాకారులకు క్రికెట్ కిట్‌ను అందజేస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్



కశింకోట బాలికల హైస్కూల్లో విద్యార్థులకు కబడ్డీ పోటీలు



తేగాడలో ఆడుదాం-ఆంధ్ర కార్యక్రమంలో మాట్లాడుతున్న దాడి రత్నాకర్



తాళ్లపాలెం హైస్కూల్లో క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న ఎంపీటీసీ సభ్యురాలు భవానీ



ఉగ్గినపాలెంలో ఆడుదాం-ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ కలగా లక్ష్మి



బయ్యవరంలో ఆడుదాం-ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాసరావు



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న గొర్లి సూరిబాబు

కశింకోట: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. క్రికెట్, కబడ్డీ, బాడ్మింటన్ పోటీలను నిర్వహించారు. కశింకోటలోని బాలికల హైస్కూల్లో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని ఎంపీపీ కలగా లక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలు శారీర దారుఢ్యానికి, మానసి కోల్లాసానికి దోహదం చేస్తాయన్నారు. విద్యతో పాటు క్రీడల పట్ల విద్యార్థులు శ్రద్ధ వహించాలన్నారు. క్రీడల్లో రాణించి ఉత్తమ క్రీడాకారులుగా ఎదిగి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. నాలుగు సచివాలయాల నుంచి వచ్చిన 8 జట్లకు కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఉగ్గినపాలెంలో ఆడుదాం-ఆంధ్ర కార్యక్రమాన్ని ఎంపీపీ కలగా లక్ష్మి ప్రారంభించారు. విద్యార్థులకు బాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. సర్పంచ్‌లు గున్నయ్యనాయుడు, మంత్రి జయరజని, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, ఎంపీడీవో రవికుమార్, ఏపీడీ మణికుమార్, ఎంఈవోలు చిట్టిబాబు, మూర్తి, ఏవో ఎ.ఎ.ఖాన్, ఏపీఎం శివ, పంచాయతీ కార్యదర్శులు ఎన్.రమేష్, వి.వి.ఎస్.ఎస్ హరనాథ్, హెచ్ఎం స్వర్ణకుమారి, పీడీలు వి.ప్రభాకరరావు, పెంటకోట కమల, రామకృష్ణ పాల్గొన్నారు.

క్రీడాస్ఫూర్తి పెంపొందించడమే ధ్యేయం

తేగాడ కస్తూర్బా బాలికల విద్యాలయంలో బాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. పోటీలను వైఎస్సార్ సీపీ అనకాపల్లి పార్లమెంట్ ఎన్నికల పరిశీలకుడు దాడి రత్నాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ప్రభుత్వం తరపున నిర్వహిస్తున్నారన్నారు. క్రీడల్లో రాణిస్తే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. ఈ క్రీడల్లో గెలుపొందిన వారికి బహుమతులతో పాటు ప్రతిభా ధ్రువ పత్రాలను అందజేస్తారని, ఇవి భవిష్యత్‌లో ఎంతగానో ఉపయోగపడనున్నాయన్నారు. ఈ సందర్భంగా కస్తూర్బా విద్యాలయం నిర్వహణ తీరును పరిశీలించారు. టెన్త్ విద్యార్థులకు అవసరమైన స్టడీ మెటీరియల్‌ను తన నిధుల నుంచి అందిస్తానని రత్నాకర్ హామీ ఇచ్చారు. సర్పంచ్ ఈశ్వరమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు మంగతాయారు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నీటిపల్లి లక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకుడు దివాకర్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు దొరబాబు పాల్గొన్నారు.తాళ్లపాలెం హైస్కూల్లో ఆడుదాం-ఆంధ్ర కార్యక్రమంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. పోటీలను ఎంపీటీసీ సభ్యురాలు భవాని ప్రారంభించారు. నాలుగు జట్లు పాల్గొన్నాయి. వైఎస్సార్‌సీపీ నాయకులు లగిశెట్టి గణేష్, ముసిలినాయుడు, చిన్ని జనార్దన్, నారాయణరావు కార్యక్రమంలో పాల్గొన్నారు.

క్రీడలకు సంపూర్ణ ప్రోత్సాహం

అనకాపల్లి: గ్రామీణ స్థాయి క్రీడాకారుల ప్రతిభను వెలికితీసేందుకు ఆడుదాం- ఆంధ్రా క్రీడా పోటీలు ఎంతగానో దోహదపడతాయని ఎంపీపీ గొర్లి సూరిబాబు అన్నారు. మండలంలోని అక్కిరెడ్డిపాలెం పంచాయతీ గణేష్‌నగర్ గ్రౌండ్‌లో మంగళవారం వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షుడు నారపిన్ని ప్రసాద్ అధ్యక్షతన తొలిరోజు క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు, యువతలో పోటీతత్వాన్ని పెంచేందుకు క్రీడలు ఉపకరిస్తాయన్నారు. క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు కలిసికట్టుగా ఆడి గ్రామానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. గ్రౌండ్ ఆవరణలో పలువురు విద్యార్థులు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. కార్యక్రమంలో మారేడుపూడి సర్పంచ్ సాలాపు కనకరాజు, అక్కిరెడ్డిపాలెం, గోపాలపురం సచివాలయాల కార్యదర్శులు, వలంటీర్లు, పార్టీ నేతలు, గృహసారథులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రికెట్ కిట్‌ల పంపిణీ

అనకాపల్లి: క్రీడల ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మండలంలో తుమ్మపాల క్రీడామైదానంలో మంగళవారం ఆడుదాం..ఆంధ్రా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ,వార్డు సచివాయలాల పరిధిలో క్రీడాపోటీలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గ్రామాల్లో క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని గుర్తించేందుకు ప్రభుత్వం 5 రకాలైన క్రీడాలను ఆడిస్తుందని, అందులో ప్రతిభకనబర్చిన క్రీడాకాలను జాతీయ, అంతర్ జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఐడబ్ల్యూ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, ఎంపీపీ గొర్లి సూరిబాబు, ప్రభుత్వశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కశింకోట: మండలంలోని బయ్యవరం హైస్కూలులో ఆడుదాం-ఆంధ్ర కార్యక్రమాన్ని అనకాపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడల పట్ల విద్యార్థులు ప్రత్యేక దృష్టి సారించి రాణించి దేశానికి మంచి పేరు తీసుకురావడానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమానికి హాజరైన నాలుగు జట్లకు క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యుడు గొన్నా నాగ సత్యనారాయణ పాల్గొన్నారు.

వైభవంగా భవానీ భక్తుల బోనాల ఊరేగింపు



కశింకోటలో బోనాలు, దీపాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న భవానీ భక్తులు

కశింకోట: కశింకోటలో మంగళవారం రాత్రి 9.30 గంటల ప్రాంతంలో భవానీ భక్తులు భారీగా బోనాల ఊరేగింపు నిర్వహించారు. విజయవాడ కనకదుర్గమ చండీ హోమం ప్రారంభం పురస్కరించుకొని స్థానిక దాడి వారి వీధి, సంత బయల ప్రాంతాల నుంచి వేర్వేరు భవాని భక్త బృందాలు, స్థానిక భక్తులు కలిసి బోనాలు, వాటిపై దీపాలు వెలిగించి డప్పుల వాయిద్యాలతో దుర్గాదేవి ప్రతిమ ఊరేగిస్తూ బాణసంచా కాలుస్తూ స్థానిక గవరపేట పెద గుమ్మం దుర్గమాంబ ఆలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. దుర్గమాంబ ఆలయంలో పూజలు చేశారు. అనంతరం స్థానిక శారదానదిలో బోనాలు, దీపాలు విడిచిపెట్టారు.

ఘనంగా పౌర్ణమి పూజలు



పాకలపాడు గురుదేవులను దర్శించుకుంటున్న భక్తులు

నర్సీపట్నం: మున్సిపాలిటీ పరిధి బలిఘట్టం పవిత్ర ఉత్తరవాహిని నదీ తీరాన ఉన్న శ్రీ పాకలపాడు గురుదేవుల ఆశ్రమంలో మంగళవారం మార్గశిర పౌర్ణమి పూజలు ఘనంగా జరిగాయి. పౌర్ణమి పూజల్లో పాల్గొని, నవగ్రహ సహిత పంచాయతన పూజ, హోమం నిర్వహించటం ద్వారా దోష నివారణ తొలగి, అనుకున్న కార్యాలు సిద్ధిస్తాయని భక్తుల విశ్వాసం . దీంతో పౌర్ణమి పూజలకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. పూజల అనంతరం భక్తులు గురుదేవులను దర్శించుకున్నారు. పౌర్ణమి పూజలతో ఆశ్రమంలో భక్తుల కోలాహలం నెలకొంది.

ఘనంగా జ్యోతిర్మయిబాబా జయంతి వేడుకలు



బాబా దివ్య సమాధి వద్ద అంజలి ఘటిస్తున్న విప్ ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట: జ్యోతిర్మయి బాబా ఆశ్రమం ఆధ్యాత్మిక కేంద్రంగా మారి పలువురికి ఆశ్రయం కల్పిస్తోందని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. మంగళవారం జ్యోతిర్మయి బాబా 98వ జయంతి వేడుకలు మండలంలోని కొమళ్లపూడి అమరపురి కొండపై ఘనంగా జరిగాయి. బాబా దివ్య సమాధిని దర్శించుకుని, అంజలి ఘటించారు. దివంగత సీఎం వైఎస్సార్ హయాంలో జ్యోతిర్మయి బాబా ఆశ్రమం కోసం ఉచితంగా భూమిని అందించి, పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. పలువురు పేదలకు పళ్లు, రొట్టెలు అందించి, ఐదు వేల మందికి అన్న సమారాధన చేశారు. జెడ్పీటీసీ దొండా రాంబాబు, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరీదేవి, డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, రాష్ట్ర కిసాన్ సెల్ ప్రధాన కార్యదర్శి కె.అచ్చింనాయుడు, మండల యూత్ అధ్యక్షుడు వేపాడ మధు, నాయకులు ముచ్చకర్ల అప్పారావు, సత్తిబాబు పాల్గొన్నారు.

ఉపాధి నిధుల దుర్వినియోగంపై చర్యలు



ప్రజావేదికలో పాల్గొన్న అధికారులు

గొలుగొండ: జాతీయ ఉపాధి హామీ పథకంలో 2022-23లో జరిగిన పనులపై గొలుగొండలో మంగళవారం ప్రజా వేదిక నిర్వహించారు. ఎన్ఆర్ఈజీఎస్ ఏపీడీ రోజా రమణి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మండలంలోని 27 గ్రామ పంచాయతీల్లో కూలీలు పనికి వెళ్లకుండా నిధులు మంజూరు చేయడంతో రూ.8 వేల వరకు వీఆర్పీల నుంచి రికవరీకి ఆదేశించారు. పప్పుశెట్టిపాలెం పంచాయతీలో జరిగిన ఇంటింటికి తాగునీటి సరఫరా పథకంలో పనులు చేయకుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు రూ.1.18 లక్షలు మంజూరు చేసినట్లు గ్రామ సభలో నిర్ధారణ కావడంతో నిధుల రికవరీకి చర్యలు తీసుకున్నారు. జోగుంపేటతో పాటు ఆరు పంచాయతీల్లో గ్రామ సచివాలయాలు, డిజిటల్ లైబ్రరీల నిర్మాణ పనులు జరగకుండా రూ.4.35 లక్షల నిధులు, సిమెంట్ కొనుగోలు పేరిట నిధుల దుర్వినియోగానికి బాధ్యులైన పంచాయతీ అధికారులపై రికవరీ, చర్యలకు సిఫార్సు చేశారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి నిర్మలదేవి, స్టేట్ రిసోర్సు పర్సన్ సూర్యనారాయణ, ఎంపీపీ గజ్జలపు మణికుమారి, మండల పరిషత్ అధికారులు, వీఆర్పీలు, అధికారులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందిస్తున్న జగన్‌మోహన్, అనురాధ

కె.కోటపాడు: పేదరికంతో మెరుగైన వైద్యం పొందలేని రోగులకు సీఎం రిలీఫ్ ఫండ్ శ్రీరామరక్ష అని ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, జెడ్పీటీసీ ఈర్లె అనురాధ అన్నారు. ఆర్లి శివారు చింతపాలేనికి చెందిన వియ్యపు గోవిందరావు అనారోగ్యంతో ప్రవేటు ఆస్పత్రిలో చేరారు. మెరుగైన వైద్యానికి ఆరోగ్యశ్రీ వర్తించలేదు. ఎంపీపీ రెడ్డి జగన్ మోహన్, మాజీ సర్పంచ్ బోళెం కృష్ణారావు, పాల సంఘం అధ్యక్షుడు చిరికి ప్రసాద్‌లు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు దృష్టికి గోవిందరావు ఆరోగ్య పరిస్థిని తీసుకెళ్లారు. దీంతో సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.40 వేలు మంజూరు చేయించారు. ఈ చెక్కును గోవిందరావుకు మంగళవారం అందించారు. సీఎం జగన్‌కు, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుకు రోగి కృతజ్ఞతలు తెలిపారు.

వైద్య శిబిరానికి స్పందన



వంటర్లపాలెం వైద్య శిబిరంలో వైద్య సేవలు అందిస్తున్న వైద్యులు

మాడుగుల రూరల్: మండలంలోని వంటర్లపాలెంలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 130 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందించారు. విశాఖ లోని అనిల్ నీరుకొండ ఆస్పత్రి ఆధ్వర్యంలో కేజే పురం భానోదయ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ సౌజన్యంతో జరిగిన శిబిరంలో శస్త్ర చికిత్సలకు 16 మందిని రిఫర్ చేశారు. సొసైటీ అధ్యక్షుడు రాపేట రామకొండలరావు, వంటర్లపాలెం మాజీ సర్పంచ్ కుమారరాజు, శీలం రాఘవేంద్ర, ఆదారి కన్నారావు తదితరుల పర్యవేక్షణలో ఆస్పత్రి వైద్యులు మహితాకృష్ణ, సాయిసింహ, వృక్షాన్, ప్రియాంక, శ్రావణి వైద్య సేవలు అందించారు. క్యాంప్ కోఆర్డినేటర్ కె.ఉదయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక బస్సు యాత్రను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కరక అప్పలరాజు

నాతవరం: ఈ నెల 30న నర్సీపట్నంలో జరిగే సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, నాతవరం ఉప సర్పంచ్ కరక అప్పలరాజు, జెడ్పీటీసీ కాపారపు అప్పలనర్స పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో మంగళవారం సర్పంచ్ గొలగాని రాణి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ ఆదేశాల మేరకు పంచాయతీ నుంచి అధిక సంఖ్యలో జనాలు తరలివెళ్లాలని కోరారు. రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని మనం పిలిస్తే ప్రజలు అభిమానంతో వస్తారని, ముందుగా వారందరికి సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు చెక్కా ప్రభావతి, వైఎస్సార్‌సీపీ నాతవరం గ్రామ కమిటీ అధ్యక్షుడు శెట్టి లచ్చబాబు, పార్టీ ఎస్సీ సెల్ మండల శాఖ అధ్యక్షుడు చెక్కా జోగిరాజు, హైస్కూల్ విద్యా కమిటీ మాజీ చైర్మన్ రెడ్డి వరహాలబాబు, వార్డు మెంబర్లు, నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తల వినూత్న నిరసన

కశింకోట: కశింకోటలోని పోలీసుస్టేషన్ పక్కన అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు నిర్వహిస్తున్న సమ్మెలో భాగంగా మంగళవారం కంచాల మోతతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొని అన్నం తినే కంచాలను గరిటెలతో మోతమోగించారు. తమ సమస్యలను పరిష్కరించి ఉద్యోగ భద్రత కల్పించాలని వారు కోరారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మజ్జి నాగశేషు, మండల సంఘం ప్రతినిధులు తనూజ, కాసులమ్మ, కొండమ్మ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయం ఎప్పటికీ పండగే

చోడవరం రూరల్: యువత వ్యవసాయాన్ని వృత్తిగా స్వీకరించి, సేంద్రియ పద్ధతిలో సాగు చేసినట్లయితే భవిష్యత్‌లో లాభాల పంట పండించవచ్చని ప్రముఖ వ్యాపారవేత్త, ప్రయోగాత్మక వ్యవసాయదారు పూసర్ల రామారావు అన్నారు. స్థానిక ఉషోదయా విద్యా సంస్థల చైర్మన్ జె.రమణాజీ ఆధ్వర్యంలో మంగళవారం బిట్2కె23 కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ సేంద్రియ విధానంలో వినూత్న పంటలను పండించిన రోజున వ్యవసాయం పండగ అవుతుందన్నారు. వ్యాపారవేత్త పీఎస్‌కే గుప్త మాట్లాడుతూ వ్యాపారం మంచిగా సాగాలంటే ఓర్పు, సౌమ్యత, వస్తు నాణ్యతలను పాటించాలన్నారు. కార్యక్రమంలో యువ వ్యాపారి ఉప్పల హర్ష, మాడుగుల మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావు, కార్యక్రమ కోఆర్డినేటర్ పి.దొరబాబు, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎన్ నాయుడు, డీన్ వెంకటవాసు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమ్మె



జీవీఎంసీ జోనల్ కార్యాలయం గేటు వద్ద సమ్మెలో పాల్గొన్న కార్మికులు

తుమ్మపాల: కార్మికుల సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగాల పర్మనెంట్, ఇంజినీరింగ్ కార్మికులకు హెల్త్ రిస్క్ అలవెన్స్, క్లాప్ డ్రైవర్లకు రూ.18,500 జీతం వంటి డిమాండ్లు పరిష్కరించాలంటూ మున్సిపల్ పారిశుద్య కార్మికులు జీవీఎంసీ జోనల్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు గంటా శ్రీరామ్, రుత్తల శంకరరావు మాట్లాడుతూ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం, ఆప్కాస్‌లో ఉద్యోగులుగా నమోదు చేసిన మేరకు పర్మనెంట్ ఉద్యోగులకు చెల్లిస్తున్న విధంగా జీతభత్యాలు, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, గ్రాట్యుటీ, పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎస్ఎంఆర్ కార్మికులను పర్మనెంట్ ఉద్యోగులుగా గుర్తించాలని, క్లాప్ డ్రైవర్లకు జీవో ఎంఎస్ నంబర్ 7 ప్రకారం నెలకు రూ.18500 జీతం చెల్లించాలని, ఈపీఎఫ్ ఈఎస్ఐ వాటా నిధుల వివరాలు కార్మికులందరికీ సకాలంలో అందించాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు బొమ్మల రాము, నిమ్మకాయ అజయ్, మంగళగిరి సంతోష్, నూకరాజు, అమ్మాజీ, శివకుమార్, అనిల్ పాల్గొన్నారు.

ఉగ్ర నరసింహునిగా ధ్యాన వేంకటేశ్వరస్వామి



కశింకోటలో ఉగ్ర నరసింహుని అవతారంలో దర్శనమిచ్చిన స్వామివారు

కశింకోట: కశింకోటలోని ధ్యాన వేంకటేశ్వరస్వామి ఉగ్ర నరసింహుని అవతారంలో భక్తులకు దర్శనం మంగళవారం ఇచ్చారు. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా స్వామిని విష్ణుమూర్తి నాలుగవ అవతారంగా ఉగ్ర నరసింహుని రూపంలో అందంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

కనకదుర్గ ఆలయంలో దీపారాధన



ఆలయంలో దీపారాధన చేస్తున్న భక్తులు

అనకాపల్లి: గవరపాలెం కనకదుర్గమ్మ ఆలయంలో మంగళవారం మార్గశిర శుద్ధ పౌర్ణమి పురస్కరించుకుని శీతాలదుర్గగా (గ్రామ దేవతగా) పూజిస్తూ, అఖండ దీప కలశల శోభాయాత్ర కార్యక్రమాన్ని ఆలయ చైర్మన్ కర్రి సన్యాసినాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవానీ భక్తులతో అఖండ దీపకలశల పూజ చేపట్టడం జరిగిందన్నారు. విజయవాడలో కనకదుర్గ అమ్మవారికి కలశల పూజలు చేసినట్టుగా ఇక్కడ ఆలయ స్థాపించినప్పటి నుంచి నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు రమణ, ఆలయ నిర్వాహకులు కాండ్రేగుల నాయుడు, కొణతాల సంతోష్ అప్పారావు నాయుడు, పొలిమేర శ్రీను, కె.ఎం.నాయుడు పాల్గొన్నారు.

భగవద్గీత శ్లోకాల పోటీల్లో ప్రతిభ



రాష్ట్ర స్థాయి పోటీలో బహుమతి పొందిన హిందు

కశింకోట: రాష్ట్ర స్థాయి భగవద్గీత శ్లోకాల కంఠస్థ పోటీల్లో తాళ్లపాలెం గాయత్రి స్కూల్‌కు చెందిన విద్యార్థులు ప్రతిభ చూపారు. విశ్వహిందూ పరిషత్, భారతీయ సంస్కృతి పరిషత్ ఆంధ్రప్రదేశ్ విభాగం ఆధ్వర్యంలో తాజాగా విజయవాడలో ఈ పోటీలు నిర్వహించారు. పోటీలో పాల్గొన్న గాయత్రి స్కూల్‌కి చెందిన సిహెచ్.హిందు(4వ తరగతి) తృతీయ స్థానంలో నిలిచి నగదు బహుమతి పొందగా, మరో విద్యార్థి జి.మహమ్య (8వ తరగతి) జ్ఞాపిక, ప్రశంసా పత్రాన్ని పొందింది. వీరిని కరస్పాండెంట్ బి.రామ్‌కుమార్, ప్రిన్సిపాల్ నగేష్ అభినందించారు.

కుష్ఠు వ్యాధిగ్రస్తుల గుర్తింపునకు సర్వే

కశింకోట: కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించడానికి బుధవారం నుంచి సర్వే నిర్వహించనున్నట్లు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎంపీహెచ్ఈఓ సత్యనారాయణ తెలిపారు. స్థానిక పీహెచ్‌సీలో కుష్ఠు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య సిబ్బందికి కుష్ఠు వ్యాధిగ్రస్తుల గుర్తింపునకు అనుసరించాల్సిన విధి విధానాలపై మంగళవారం సమావేశం నిర్వహించి అవగాహన కలిగించారు. ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి కుష్ఠు వ్యాధిగ్రస్తులను సర్వేలో గుర్తించాలన్నారు. అనుమానితులు ఉంటే వారిని వైద్యాధికారి వద్దకు తీసుకెళ్లి చికిత్స అందించాలన్నారు.

ఘనంగా సీపీఐ వ్యవస్థాపక దినోత్సవం

కశింకోట: మండలంలోని పలు గ్రామాల్లో సీపీఐ వ్యవస్థాపక దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించి అరుణ పతాకాలను ఎగుర వేశారు. కశింకోట, తాళ్లపాలెం, కన్నూరుపాలెం గ్రామాల్లో కార్యక్రమాన్ని నిర్వహించారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు, ప్రతినిధులు ముత్యాలు, సత్తిబాబు, త్రినాథ్, పాల్గొన్నారు.